క్లుప్తంగా

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 15. వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి 35, కాకర 45, బీర 40, క్యాలిఫ్లవర్ 28, క్యాబేజీ 16, కారెట్ 40. దొండ 23, ఆలు 20, ఉల్లి 14, గోకర 45, దోస 18, సొర 07, పొట్ల 15, అరటి 09, చిక్కుడు 65, అర్వి 31, మునగ 45, చిలగడదుంప 53, బీట్‌రూట్ 21, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 125, కాప్సికమ్ 40. ఈధరల సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

రక్త దాతలకు సర్టిఫికెట్లు అందజేత



ఎల్‌బీనగర్: మదర్ థెరిసా సొసైటీ నిర్వహించిన రక్తదాన కార్యక్రమాలలో రక్త దానం చేసిన దాతలకు ఆదివారం వనస్థలిపురంలో సర్టిఫికెట్లను అందజేశారు. రచయిత, కవి, ప్రొఫెసర్ డాక్టర్ కోటేశ్వరరావు,సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్, సభ్యులు శివశంకర్, సునీత పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

నాగోలు: తమతో పాటు చదువుకున్న మిత్రుడు అకాల మరణం చెందడంతో స్నేహితులు కలసి అతడి కుటుంబానికి అండగా నిలిచారు. మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990లో పదవ తరగతి చదువుకున్న వారిలో ముదికొండ కిషన్ మృతి చెందాడు. దీంతో మలక్‌పేట ఓల్డ్ స్టూడెంట్ మిత్ర మండలి తరుపున అందరూ కలిసి కిషన్ కుమార్తె పెళ్లి ఖర్చుల కోసం రూ.46500 జమచేసి ఆదివారం కొత్తపేటలో అందజేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

మీర్‌పేట: వ్యసనాలకు దూరంగా ఉండడంతోపాటు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ విద్యార్థులకు సూచించారు. మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 21వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు శనివారం రాత్రి జరిగాయి. సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలో కొంత మంది డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, సమయాన్ని వృథా చేయకుండా జీవితంలో ఎలా స్థిరపడాలన్న దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అందుకు కృషి చేసిన అధ్యాపకులకు కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి సీపీ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కళాశాల సెక్రటరీ హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ అమర్‌నాథ్‌రెడ్డి, తీగల అరుంధతి, తీగల తులసి తదితరులు పాల్గొన్నారు.

కులాల రాజకీయ పార్టీలను ఓడించాలి

కాచిగూడ: 'దోపిడి కులాల రాజకీయ పార్టీలను ఓడించకపోతే నిమ్న జాతులకు సామాజిక బానిసత్వం తప్పదని' దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ సీఎం కేసీఆర్ దోపిడి, అప్రజాస్వామిక పాలన నడుస్తోందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంతర్గతంగా కుమ్మక్కై మెజార్టీ దళిత బహుజన జాతులను సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అణిచివేస్తున్నారన్నారు. ఆదివారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. ఈ దోపిడీ కులాల పార్టీల నాయకత్వం నుంచి దళిత జాతి విముక్తి కావాలని లేకపోతే దళిత జాతికి అన్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 17న ఢిల్లీలో జరిగే పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్టీ అజెండా కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. డాక్టర్ వీ.ఎల్. రాజు, బీరం సతీష్‌కుమార్, వసంతరావు, గణేష్, దేవునూరి శ్రీనివాస్, మద్దెల ప్రవీణ్ కుమార్, చిప్పరి సుబ్బారావు తదితరులున్నారు.

తైక్వాండో కలర్‌బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

చిక్కడపల్లి: తైక్వాండో అసోసియేషన్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కెనరా బ్యాంక్ జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ కృష్ణ ఆధ్వర్యంలో 100కి పైగా కలర్‌బెల్ట్ టెస్టుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ముఖ్య అతిథిగా తైక్వాండో అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం టెస్ట్‌లో పాల్గొన్న వారికి కలర్‌బెల్ట్‌లను ప్రదానం చేశారు. మాస్టర్స్ సంజయ్‌సింగ్, ప్రసన్న ఆంజనేయులున్నారు.



శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



వనస్థలిపురం శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు



నాగోలు శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

వనస్థలిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.1116 మంది భక్తులు 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. బీజేపీ నాయకులు పేరాల శేఖర్‌రావు, పోచంపల్లి గిరిధర్, తడకమళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ శ్రీనివాస్ కాలనీలో శ్రీ శ్రీఅభయాంజనేయ స్వామి దేవాయలంలో ఆదివారం సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తి సహిత శ్రీహనుమాన్ ఏకదశ జయంతి మహోత్సవములు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మోటుపల్లి లక్ష్మీ రామాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

చంపాపేట: వైశాఖ బహుళ దశమి సందర్భంగా ఆదివారం హనుమాన్ జయంతిని చంపాపేటలోని పలు హనుమాన్ ఆలయాలలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయం, ఆంధ్రో కాలనీలోని శ్రీ శివరామ క్షేత్రం ఆలయాలకు భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరారు. కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

మన్సూరాబాద్: హనుమాన్ జయంతి వేడుకలను మన్సూరాబాద్‌లోని పలు ఆలయాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో హోమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణా పురం డివిజన్ ఆల్కపురి కాలనీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో రామకృష్ణా పురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి,మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురుస్థానిక నాయకులు పాల్గొన్నారు.

సైదాబాద్: ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్‌ల పరిధిలోని దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝాము నుండే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని తిరమలహిల్స్‌లోని హనుమాన్ దేవాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చంచల్‌గూడ: హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం కుర్మగూడలోని ఇస్కల మఠం హనుమాన్ దేవాలయంలో వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు విజయ్, వినయ్‌కిషోర్‌యాదవ్, వీరేందర్‌బాబుయాదవ్, నందు, సునీల్, శ్రీనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి



పూజలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి దంపతులు



తిరుమలహిల్స్‌లో..

కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ వివరించాలి



సైదాబాద్ వాల్ రైటింగ్ అభియాన్‌లో పాల్గొన్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: దేశంలో అన్నివర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ సూచించారు. ఆదివారం సైదాబాద్‌లో ఆయన పార్టీ నాయకులతో కలిసి వాల్ రైటింగ్ అభియాన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, లోకేష్, కోళ్ల గోపి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



పహాడీషరీఫ్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీలో ఆ పార్టీ నేతలు శనివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. షాహీన్ నగర్ నుంచి పహాడీషరీఫ్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నియోజకవర్గం నాయకుడు నర్సింహారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాణసంచా కాల్చుతూ.. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. మతతత్వ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీకి కర్ణాటక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కూడా కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమీర్ అలీ, సాధిక్ మహ్మద్, జహంగీర్ ఖాన్, అబ్దుల్ బారీ, ఉమర్ బహమెద్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

సహభావన టౌన్‌షిప్ సి-బ్లాక్ అసోసియేషన్ ఎన్నిక



సాక్షి, హైదరాబాద్: నాగోలు బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ సహభావన టౌన్‌షిప్‌లోని సీ-బ్లాక్‌లకు సంబంధించిన 'సహభావన టౌన్‌షిప్ ఎమరాల్డ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్' ఎన్నికల్లో యూనిట్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఈ ప్యానల్ నుంచి పోటీ చేసిన వి.శ్రీనివాసరావు అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రత్యర్థిపై 210 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అదేవిధంగా యూనిటీ ప్యానల్ నుంచి పోటీలో దిగిన అభ్యర్థుల్లో వైస్ ప్రెసిడెంట్‌గా ఎల్.శ్రీనివాస రాజు, జనరల్ సెక్రెటరీ బి.వెంకన్న, ట్రెజరర్ టీఎస్ పూజిత, జాయింట్ సెక్రెటరీ ఆర్.సురేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎల్.నందు, అసిస్టెంట్ ట్రెజరర్‌గా ఆనందిత దాస్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎ.సురేశ్‌కుమార్, ఎం.విక్రంరెడ్డి, ఎం. ప్రవీణ్ కుమార్, కే శ్రీధర్ రాజు, పి.వేణుమాధవ్, కె.గోపాలకృష్ణన్ రాజు, ఎస్.బాలకిరణ్‌లు ఎన్నికయ్యారు. సి-బ్లాక్‌లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈసందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

హస్తినాపురం: సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా సాదన చేయాల్సిన అవసరం ఉందని యోగా గురువు, సేవ యోగిరత్న అవార్డు గ్రహీత ఇస్మాయిల్ గురూజీ అన్నారు. హస్తినాపురంలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్‌లో శ్రీషిరిడి సాయి అష్టాంగ యోగాశిక్షణా తరగతులు ఆదివారం ఘనంగా ఇస్మాయిల్ గురూజీ ప్రారంబించారు. ఇస్మాయిల్ గురూజీ తదితరులు పాల్గొన్నారు.ఈనెల 28 వరకు శిక్షణ ఉంటుందన్నారు.



యోగా సాధన చేస్తున్న దృశ్యం

క్రైం కార్నర్

అక్రమంగా ఇంట్లోకి వెళ్లి బెదిరించిన ఆరుగురు అరెస్ట్

హస్తినాపురం: ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులకు పాల్పడి భయానక వాతావరణం సృష్టించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఏరియా ఆసుపత్రి దగ్గర ఉన్న మహ్మద్ రియాజ్ ఒక అమ్మాయిని వేధింపులకు గురిచేస్తున్నాని ఆరుగురు వ్యక్తులు శనివారం రాత్రి రియాజ్ ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించారు. వారు బెదిరింపులకు పాల్పడడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గుండాల ఆనంద్(32) , నిట్టల రంగనాధ్ (45), తన్నీరు లక్ష్మీనారాయణ (29), నేలపాటి రాజేశ్ (26) , షేక్ అబ్దుల్ రజాక్ (27), వినకోటి కొండారావు (40)లపై కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నాగోలు: ద్విచక్ర వాహనం ఆటోను ఢీ కొనడంతో ఆటోలో ఉన్న వ్యక్తి తీవ్ర రక్త గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన మేరకు..తట్టిఅన్నారానికి చెందిన గుంటగాని కొండల్‌రావు(39) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొండల్‌రావు తన ఆటోతో శనివారం రాత్రి సమయంలో నాగోలుకు వెళుతున్నాడు. బండ్లగూడ ఆనంద్‌నగర్ చౌరస్తా సమీపంలోని మోడీ ఫోర్ట్ కార్లు షోరూమ్ వద్ద కు రాగానే.. నాగోలు సాయినగర్ కాలనీ చెందిన పువాల లోహిత్ తన ద్విచక్ర వాహనంపై వస్తూ ఎదురు వస్తున్న ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కొండల్‌రావుకు తీవ్ర రక్త గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో లోహిత్ రక్త గాయాలు కాగా చికిత్స నిమిత్తం నాగోలు చౌరస్తాలోని సుప్రజ హాస్పిటల్‌లో చేర్పించారు.

హిందూ ఏక్తా యాత్రలో మన నాయకులు

బడంగ్‌పేట్: కరీంనగర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తలపెట్టిన హిందూ ఏక్తా యాత్రకు బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ పార్టీ కార్యాలయం నుంచి భారీఎత్తున ర్యాలీగా కాషాయ శ్రేణులతో కలిసి అందెల కరీంనగర్ తరలివెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జంగయ్య, లక్ష్మణ్, మల్లేశ్, బీజేవైఎం యువకులు పార్టీ నాయకులు ఉన్నారు.

స్థలం కేటాయించాలని మంత్రి సబితకు వినతి

మీర్‌పేట: నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ మీర్‌పేట సంఘం ప్రతినిధులు ఆదివారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 200 గజాల స్థలం, భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం మీర్‌పేట అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ తెలిపారు. అనంతరం సంఘం తరపున మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, విజయ్ రాచకొండ, వెంకటేష్, డీ రామకృష్ణ, డీ రూప్‌కిరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీరప్పస్వామి కల్యాణం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి మల్లాపూర్‌లోని బీరప్పస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సబితారెడ్డి విచ్చేస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనగలరని ఆయన కోరారు.

ఉరి వేసుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సైదాబాద్: ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లో నివసించే సామ రామిరెడ్డి కుమారుడు సామ ప్రవీణ్ కుమార్‌రెడ్డి (33) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతనికి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఆదివారం మధ్యాహ్నం అతను తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని తెలిపిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వరదముంపు సమస్య పరిష్కారానికి చర్యలు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జలమండలి జీఎం వినోద్

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని రేడియో కాలనీలో వరద ముంపు నివారణకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రేడియో కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జలమండలి జీఎం వినోద్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షపు నీరు పోవడానికి సరైన వ్యవస్థ లేకపోవడంతో వరదనీరు కాలనీలో చేరి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. వర్షం నీరు పోవడానికి ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా ఔట్‌లైట్ పైపులైన్ వేయడానికి స్థలం ఇవ్వాలని స్థల యజమాని ముద్దగౌని సుమన్‌గౌడ్‌ను కోరడంతో ఆయన అంగీకరించారని అన్నారు. త్వరలోనే పనులు చేపట్టి కాలనీ సమస్యను పరిష్కరిస్తామని ఆయ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్, నాయకులు అజయ్ యాదవ్, కాలనీ అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇబ్బందులు పడకుండా చర్యలు



మన్సూరాబాద్ పెద్దచెరువు వాకర్స్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వాకర్స్ ఇబ్బందులు పడకుండా మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద అన్ని వసతులు కల్పిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ పెద్దచెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ ఆదివారం పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పెద్దచెరువు ప్రాంగణంలో యోగా షెడ్‌ను ఏర్పాటు చేశామని, వాకింగ్ ట్రాక్‌పై లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

పేద అనాథ విద్యార్థుల చదువుకోసం.. పెన్షన్ డబ్బు అందజేత



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న చిలుక హైమవతి, ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ లో మదర్స్ డే సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి మాతృ మూర్తి చిలుక హైమవతి వచ్చే పెన్షన్ డబ్బుల నుండి మునగనూర్ గ్రామంలో సీఎస్‌ఎస్ సంస్థకు రూ. 25వేల చెక్కును ఆదివారం అందజేశారు. అందరూ సామాజిక బాధ్యతగా తమ వంతు సహాయం చేయాలని విజ్ఞప్తి చేసారు.

చర్మ వ్యాధుల నివారణకు వైద్య శిబిరం



చంచల్‌గూడ: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వీణరాలజిస్ట్, లెప్రాలాజిస్ట్ (ఐఏడీవీఎల్) ఆధ్వర్యంలో ఆదివారం చంచల్‌గూడ పురుషుల, మహిళ జైళల్లో ఖైదీలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని హైదరాబాద్ డీఐజీ మురళీబాబు ప్రారంభించారు. చర్మ సంబంధిత వ్యాధులకు సంబంధించి ఫ్రీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 400 మంది ఖైదీలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డీఐజీ మురళీబాబు, సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ గౌడ్‌లు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే చర్మ సంబంధిత వ్యాధులు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డా. విజయ్, డా. దినేష్, అనూప్‌కుమార్, డా. ఇందిర, డా. భూమేష్ తదితరులు పాల్గొన్నారు.